www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023
5
పశ్చిమ గోదావరి

జెడ్‌పి సిఇఒగా సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జెడ్‌పి సిఇఒగా కెవిఎస్‌ఎస్.సుబ్బారావు నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి సిఇఒగా, డిప్యూటీ సిఇఒగా విధులు నిర్వహించిన రవికుమార్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. గుడివాడ డిఎల్‌డిఒగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జెడ్‌పి డిప్యూటీ సిఇఒగా పెదపాడు ఎంపిడిఒ నిర్మలజ్యోతిని ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. తొలుత జెడ్‌పి సిఇఒగా కాకినాడ ఆర్‌డిఒ కెవిబి.సత్యనారాయణను నియమిస్తూ జిఒ జారీ చేశారు. కానీ ఆ జిఒను సవరించి మరో జిఒ విడుదల చేసి సుబ్బారావును సిఇఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ప్రేక్షకులకు సినిమా కష్టాలు

- ఆన్‌లైన్‌లో టిక్కెట్లు ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్మకాలు
- అధిక ధరలకు తినుబండారాల విక్రయాలు
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- సౌకర్యాల లేమితో ప్రేక్షకుల అవస్థలు
- కొరవడిన అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సినిమా థియేటర్లకు వెళ్తున్న ప్రేక్షకులకు యాజమాన్యాలు సరికొత్త 'బొమ్మ' చూపిస్తున్నాయి. ఓ పక్క ప్రేక్షకుల జేబు గుల్లవుతున్నా వినోదం సంగతి పక్కనపెడితే సినిమా కష్టాలు పడుతున్నారు. ఎడాపెడా ప్రేక్షకుడి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు అందుకు తగిన సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో థియేటర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఎంత పెద్దహీరో సినిమా రిలీజ్ అయినా పది, 15 రోజుల్లోనే రద్దీ తగ్గిపోతుంది. దీంతో సినిమాలను అత్యధిక స్క్రీన్స్‌పై ఒకేసారి రిలీజ్ చేసి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి ఉంది. కొత్త సినిమాలకు టిక్కెట్ల ధరలను పెంపుచేసి అమ్ముకునేందుకు అవకాశం సైతం ఇస్తోంది. ఇది చాలదన్నట్లు బ్లాక్‌లో సైతం టిక్కెట్ల విక్రయాలు సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెం ఇలా అనేక పట్టణాల్లో పెద్దఎత్తున సినిమా థియేటర్లు ఉన్నాయి. దాదాపు వందకుపైగా స్క్రీన్‌లు ఉన్నాయి. ఒక్క ఏలూరులోని సినిమా హాళ్లలో 11 స్క్రీన్లపై సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఆన్‌లైన్ టిక్కెట్ ధర రూ.150 ఉన్నప్పటికీ సినిమా రిలీజ్ సమయంలో అందుకు విరుద్ధంగా ధరలు పెంచుతున్నారు. కొంతమేర టిక్కెట్ పెంపునకు ప్రభుత్వం అవకాశం ఇస్తుండటంతో ఇదే అదునుగా మరింత దారుణంగా టిక్కెట్ ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ టిక్కెట్లు ముందుగానే అయిపోయినట్లుగా బ్లాక్ చేసి సినిమా థియేటర్ వద్ద రూ.150 టిక్కెట్‌ను రూ.200 నుంచి రూ.250 వరకూ బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. పోలీసులుగానీ, రెవెన్యూ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక సినిమా థియేటర్లలో తినుబండారాలు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఎక్కడా అలాంటి పరిస్థితి లేదని చెప్పొచ్చు. పాప్‌కార్న్ కొనాలన్న అదిరిపడే పరిస్థితి నెలకొంది. రూ.20 ఖరీదు చేసే వాటర్‌బాటిల్ ఒక్కో థియేటర్‌లో రూ.30, మరికొన్ని థియేటర్లలో అంతకు మించి విక్రయిస్తున్నారు. సమోస సైతం రూ.పదికి విక్రయిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అదేమని అడిగిన ప్రేక్షకులపైకి వ్యాపారులు గొడవలకు దిగుతున్నారు. పెద్దఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్న థియేటర్ల యాజమాన్యాలు మరుగుదొడ్ల నిర్వహణ సైతం సరిగా నిర్వహించడం లేదు. టాయిలెట్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా మహిళలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం థియేటర్లలో వాహనాల పార్కింగ్‌కు డబ్బులు వసూలు చేయకూడదు. కానీ మోటారుసైకిళ్లకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు కొనసాగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

అధికారుల తనిఖీలు శూన్యం..

సినిమా థియేటర్లలో నిబంధనలు అమలుపై అధికారుల తనిఖీలు అనేవి లేకుండా పోయాయి. యాజమాన్యాలు, అధికారులు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. థియేటర్లలో విక్రయించే తినుబండారాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసిన దాఖలాలే లేవంటే అతిశయోక్తికాదు. అదేవిధంగా టిక్కెట్ల విక్రయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తినుబండారాలకు సంబంధించి ఎంఆర్‌పి అమలు వంటివాటిపైనా అధికారుల తనిఖీలు లేకుండా పోయాయి. దీంతో థియేటర్ యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. ప్రేక్షకుడిని నిలువెల్లా దోచేస్తున్నప్పటికీ సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల వివరాలను సర్పంచి మంగతాయారుతో చర్చిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు

ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలాల్లో లబ్ధిదారులు ఇల్లు కట్టుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు అధికారులకు సూచించారు. గురువారం ఆయన వీరవాసరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ జ్యోతి, మండల ప్రత్యేకాధికారి బి.సుజాత రాణి, హౌసింగ్ ఎఇ శ్రీరామచంద్రమూర్తితో సమీక్షించారు. ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు ఇల్లు కట్టుకోకుండా అమ్ముకోవచ్చనే ఆలోచనతో ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి ఆ స్థలాన్ని మరొకరికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ సూచించారు. ఇప్పటికీ కొంత మంది ఇల్లుకట్టుకోని వారికి నోటీసులిచ్చామన్నారు. గడువులోపు ఇల్లుకట్టుకోకపోతే పట్టా రద్దు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు పలు సమస్యలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని, డంపింగ్ యార్డుకు స్థలాన్ని సమకూర్చాలని, పారిశుధ్యం చెత్తను సేకరించడానికి సరిపడే వాహనాలు లేవన్నారు. ఇదే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అవసరం ఉందని ఆర్‌డిఒకి సర్పంచి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ పలు అంశాలపై ఆరా తీశారు. గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మహిళలు అధికంగా వినియోగించుకోవడం, ఇంటిలో ఆదరణలేని వృద్ధులకు వైద్యసేవలందించేలా దృష్టిపెట్టాలని సూచించారు.



వినియోగదారుడికి పార్సిల్ అందజేస్తున్న ఆర్‌టిసి ఆర్‌ఎం చౌదరి

ఆర్‌టిసి కార్గో మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్‌టిసి కార్గో పార్శిల్ కొరియర్ రవాణా విభాగం డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెల 25వ తేదీ వరకూ డోర్ డెలివరీలు అందిస్తున్నామని ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ ఎ.వీరయ్య చౌదరి తెలిపారు. భీమవరం ఆర్‌టిసి బస్టాండ్‌లో గురువారం డోర్ డెలివరీ మాసోత్సవాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. 50 కేజీల బరువు గల పార్శిల్‌ను డోర్ డెలివరీ మీ ఇంటి వద్దకే చేరస్తామని, పది కిలోమీటర్ల పరిధిలో ఈ డోర్ డెలివరీ సేవలను అందిస్తున్నామని, మన జిల్లాలోని నాలుగు డిపోల్లో ఈ సేవలందిస్తున్నామని తెలిపారు. గతేడాది నాలుగు డిపోల్లో రోజుకు 6500 డోర్ డెలివరీలు అందించామని తెలిపారు. ఈ ఏడాది దానికన్నా ఎక్కువ డోర్ డెలివరీలు అందిస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన ఆర్‌టిసి సర్వీసులను అందించడమే లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ పిఎన్‌విఎం.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - తణుకు రూరల్

రోజుకోరకంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, కరెంట్ ఛార్జీలతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అదుపుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. గురువారం స్థానిక అమర వీరుల భవనంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ... ఎన్నికల ముందు 'నేను ఉన్నాను, నేను విన్నాను' అని చెప్పిన మాటలకు అనుగుణంగా నేడు పాలన లేదన్నారు. నిత్యావసర ధరలు ఆకాశనంటుతున్నా ప్రభుత్వం ధరల నియంత్రణ చేపట్టకపోవడం శోచనీయమన్నారు. కరెంట్ ఛార్జీలు గతంలో ఎన్నడూ లేనివిధంగా రకరకాల పేర్లతో వాడిన దానిమీద డబుల్ వేస్తున్నారన్నారు. రైతులు నీరందక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆక్వా సాగు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. జగనన్న ఇంటి నిర్మాణాలు జిల్లాలో ఆలస్యంగా జరగ డానికి కారణం ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోవడం లేదని, రూ.ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తి చేసి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చాలా పరిశ్రమల్లో చట్టాలను అమలు చేయడం లేదని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, కామన మునిస్వామి, గార రంగారావు, అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి, మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ పట్టణ సభ్యుల జనరల్ బాడీ సమావేశం గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లాలో, తాడేపల్లిగూడెంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. చాలా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు, ప్రభుత్వాలకు పట్టడం లేదని, వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచిందని, ఆ భారాలను ప్రజలు మోయలేకపోతున్నారని తెలిపారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలకు కొనుగోలు శక్తి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరెంట్ బిల్లులు చూస్తే షాక్ కొడుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన బిల్లులకు సర్‌ఛార్జీలు వేసి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో నన్నయ్య యూనివర్సిటీలో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టాలని, వెంకట్రామన్న గూడెంలో గేదెల పరిశోధనా కేంద్రాన్ని అభివృద్ధి చేసి రైతాంగానికి ఉపయోగపడేలా చేయాలని కోరారు. నిట్ యూనివర్సిటీలో రెండో దశ పనులు ప్రారంభించి అభివృద్ధి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ధరలను తగ్గించాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన, ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కరెడ్ల రామకృష్ణ, సిద్దిరెడ్డి శేషుబాబు, వర్రి అప్పారావు, మడకా రాజు, దనాల వెంకట్రావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, సిపిఎం నాయకులు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

తాగునీరు ఇప్పించండి మహాప్రభో అంటూ ఖాళీ బిందెలతో మహిళలు గురువారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. చినపల్లివీధి, రజిత వీధి డైలీ మార్కెట్ సమీప ప్రాంతాల మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన తెలిపారు. నిరసనకు సిపిఎం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి తొమ్మిదో వార్డు ఇన్‌ఛార్జి దుర్గారావు మాట్లాడుతూ సుమారు 15 రోజులుగా తాగునీరు రాక స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. పైప్‌లైన్ పాడైపోయి ఎన్నిసార్లు బాగు చేయాలని మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ గతంలో నీరు రానప్పుడు పంచాయతీ వారు ట్యాంకులతో తాగునీరు అందించేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. వెంటనే సర్పంచి పైప్‌లైన్ బాగు చేయించి, తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు టి.వెంకటరాము, టి.వెంకట అప్పారావు, తిరుమాని దుర్గ, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, సిపిఎం నాయకులు బి.వర్మ పాల్గొన్నారు.

సిపిఎం ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వచ్చేనెల 15న చలో విజయవాడ ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెంప పెద్దపేటలో స్థానిక భవనంలో ప్రజా రక్షణ బేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ ఆంధ్రాకు ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు నిధులు విడుదలలో జాప్యం, రామయ్యపట్నం మేజర్‌పోర్ట్, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా దగా చేస్తుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే ప్రజారక్షణ బేరిలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంద మార్తమ్మ, బి.మరియమ్మ, కుర్ర మోహన్‌రావు, ఇంజేటి మరియమ్మ, సిర్ర శాంతకుమారి, చిలకపాటి శకుంతల, బాలం సక్కుబాయి పాల్గొన్నారు.

అమలు కాని హామీలు వద్దు

చెత్త తొలగించాలని చినకాపవరం వంతెనపై కొల్లేటి గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నుంచి సిద్ధాపురం వెళ్లే రోడ్డు గుండా వేస్తున్న చెత్తను తొలగించాలని కోరుతూ చినకాపవరం వంతెనపై కొల్లేటి గ్రామస్తులు, రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. డ్రెయిన్ వంతెనపై చెత్తగుట్టల పక్కన శిబిరం ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అటుగా మున్సిపాల్టీ వారు తీసుకొస్తున్న చెత్త వాహనాలను నిలిపివేశారు. దీంతో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని పది రోజులు క్రితం తహశీల్దార్ కార్యాలయం వద్ద సుమారు గంట సేపు ఆందోళన చేసి వినతిపత్రం అందించామని ఆందోళనకారులు తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, మీ మాట నమ్మేందుకు సిద్ధంగా లేమని అధికారికి తెలిపారు. ఈ ఆందోళన మధ్యాహ్నం వరకూ కొనసాగింది. అనంతరం కమిషనర్ కృష్ణమోహన్ వారితో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి డంపింగ్ యార్డ్ స్థలాన్ని ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపురం గ్రామ సర్పంచి చిట్టిబాబు, రైతు నాయకులు తిమ్మరాజు, నారాయణరాజు, రైతులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేనుస్తన్న గ్రామస్తులు, రైతులు

సిపిఎం సంఘీభావం..

మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల ప్రజలు చేస్తున్న ఉద్యమానికి సిపిఎం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ ఆకివీడు నుంచి సిద్ధాపురం వెళ్లే రహదారి పక్కన రాకపోకలకు అంతరాయంగా చెత్త వేస్తున్నారన్నారు. తక్షణం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో బడాబాబుల ఆధీనంలో ప్రభుత్వ భూములు అనేకం అన్యాక్రాంతం అయ్యి ఉన్నాయని వాటిని వెలికి తీసి డంపింగ్ యార్డ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రాంబాబు, డి.రవితేజ, ఎస్.సూరిబాబు, బివి.వర్మ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

పట్టాల మంజూరులో వివక్ష తగదు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దళితులకు ఇళ్ల పట్టాల మంజూరులో భూస్వామితో కుమ్మక్కై వివక్ష చూపడం అన్యాయమని, అలాంటి వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నివాసముంటున్న దళితులకు, బిసిలకు ఇళ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని కోరారు. మండలంలోని సగంచెరువులో భూస్వామి వేధింపులకు గురవుతున్న దళితుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ బృందం గ్రామంలో పర్యటించింది. 55 మందికి పట్టాలిచ్చి ఐదుగురికి నిలిపివేయడం కుల వివక్ష అని అన్నారు. 1919 నుంచి సగం చెరువులో రోడ్డు పక్కన ప్రభుత్వ పోరంబోకు పుంతలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా కలిసి మెలిసి జీవిస్తున్నారని తెలిపారు. 2018లో టిడిపి హయాంలో 55 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. కానీ దళితులు, బేడ బుడగ జంగాలు, బిసి కులాలు చెందిన ఐదు కుటుంబాలకు పట్టాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని విమర్శించారు. వీరి ఐదుగురి ఇళ్లకు ఆనుకుని ఉన్న పంటల భూస్వామి తన కులదురహంకారంతో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో పట్టాలు ఇవ్వనివ్వలేదని తెలిపారు. 60 మందిలో కేవలం ఐదుగురికి మాత్రమే పట్టాలు ఇవ్వకపోవడం అంటే కులవివక్షే అని విమర్శించారు. సుమారు వందేళ్ల పైబడి ఉంటున్న ఇళ్లను ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. శతాబ్ద కాలంలో ఒక్కసారి కూడా అడ్డురాని ఇళ్లు ఇప్పుడు అడ్డు అని చెప్పడం అన్యాయమన్నారు. కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కానేటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు గల్లా ఏడుకొండలు, మండల కార్యదర్శి పి.శ్యామ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మాచవరపు సుబ్బారావు, బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి : ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. గురువారం కెపిపాలెం నార్త్‌లో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి సోంబాబు, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, అండ్రాజు చల్లారావు కర్రి ఏసుబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం టౌన్ : మండలంలోని పసలదీవి గ్రామ సచివాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య రక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. అందరి ఆరోగ్య బాధ్యతను తన ఆరోగ్య బాధ్యతగా ముఖ్యమంత్రి తీసుకొని ఇంటి వద్దకే వైద్యులను పంపించి వైద్య సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు అండ్రాజు చల్లారావు, లేసు పార్కు అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ

ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధి హామీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చుని ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మారంపూడి బాపూజీ అన్నారు. గురువారం సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి గ్రామాల్లో ఉపాధి హామీపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ సోమరాజు ఇల్లింద్రపర్రులో జరిగిన కార్యక్రమంలో 439 జాబ్ కార్డులకు 413 మందికి 91 దినాలు కల్పించినట్లు తెలిపారు. రూ.20.40 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.11.83 లక్షలతో భవన నిర్మాణ మెటీరియల్ మొత్తం రూ.37.83 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే మల్లిపూడిలో 421 జాబ్ కార్డులకు 310 మందికి 85 దినాలు కల్పించినట్లు తెలిపారు. రూ.26.40 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.10 లక్షల 43 వేలతో వివిధ భవన నిర్మాణ మెటీరియల్ పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు వనం సూర్యనారాయణ, దొంగ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పి.ముసలయ్య, ఎస్.మోహన్ రావు, ఉప సర్పంచి కర్రి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై అమ్మవారిని ఊరేగిస్తున్న సర్పంచి

ఘనంగా మద్దిరమ్మ జాతర

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడిలో మద్దిరమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా అమ్మవారి జాతర సందర్భంగా ఎడ్ల బండిలో అమ్మవారిని ఊరేగించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఎడ్లబండిపై అమ్మ అమ్మవారిని ఊరేగించే అవకాశాన్ని గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దిరమ్మ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు బి.రామయ్య, కొల్లి సాయి, జెట్టిబోయిన పోతురాజు, కొల్లి త్రిమూర్తులు, జెట్టిబోయిన శ్రీనివాస్, వెలివెల సత్యనారాయణ, కొల్లి శివన్నారాయణ, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఒ జ్యోష్నిల

అభ్యంతరాలుంటే తెలపండి : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్‌కు సంబంధించి ఇ-పంట, ముసాయిదా లిస్ట్‌ను రైతులు పరిశీలించుకుని అభ్యంతరాలుంటే తెలపాలని ఎ.ఒ.జ్యోష్నిల అన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్ సంబంధించిన లిస్ట్‌ను ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు వారి పంట నమోదు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే ఆర్‌బికెల్లో వివిఎఎను సంప్రదించాలని తెలిపారు. ఈ లిస్టు ఈ నెల 29వ తేదీ వరకూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సత్యనారాయణ, దుర్గ భవాని, వివిఎలు, రైతులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ఆడ శిశువుకు జన్మనిచ్చిన అనూష

అంబులెన్స్‌లో ప్రసవం

ఆచంట: 108 వాహనంలో గర్భిణి ఆడ శిశువుకు జన్మనిచ్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి అనూష ప్రసవం నిమిత్తం చేరింది. అయితే శిశువు మెడలో పేగు చుట్టుకుని ఉండడంతో ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం వల్లూరు నుంచి 108 వాహనంలో తణుకు తీసుకెళ్తున్నారు. అయితే మార్గ మధ్యలో అంబులెన్స్‌లోనే అనూష ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు పేగు మెడలో వేసుకుని పుట్టినప్పటికీ సిబ్బంది సాధారణ ప్రసవం చేయడంతో అనూష తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అనంతరం తల్లీబిడ్డను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ఉండి: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు సాధించామని సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. గురువారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా 15వ మహాసభల్లో దుర్గాభవాని ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహాసభకు నెక్కంటి జగదాంబ, దేవి, యర్రంశెట్టి శాంతామణి అధ్యక్షత వహించారు. దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధి లేదన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహిళా సమాఖ్య దేశవ్యాప్తంగా పోరాటాలు సాగించిందన్నారు. చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయనడం మహిళలను వంచించడమేనన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత తమ లక్ష్యమని చెపుతున్న ప్రభుత్వాలు ఆచరణలో మహిళలకు మొండి చేయి చూపుతున్నారన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం వెలికితీసి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పి నేడు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడారు. తొలుత మహిళా సమాఖ్య పతాకాన్ని సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.దేవి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, సిపిఐ నాయకులు సాయిన శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఆర్‌టిసి డిపో వద్ద రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనీ ప్రణాళికా బద్ధంగా చేస్తున్నామన్నారు. భీమవరం పట్టణాభివృద్ధికి సంబంధించి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే అభివృద్ధి పరంగా భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులోనూ తాము చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

డిపో రోడ్డు మలుపు వద్ద కట్టడాలను తొలగించండి...

ఆర్‌టిసి డిపో రోడ్డు మలుపు వద్ద ఉన్న కట్టడాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. డిపో వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ మలుపులో ఉపయోగం లేని కట్టడాలు ఉన్నాయని, వాటిని తొలగిస్తే మలుపు వద్ద ప్రమాదాలు జరగవని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువత మనసును అదుపు చేసుకున్నప్పుడే, కోరికలకు అడ్డుకట్ట వేసినప్పుడే భవిష్యత్ బంగారు బాట అవుతుందని డిఎస్‌పి శ్రీనాథ్ అన్నారు. గురువారం శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా ఉండాలే తప్ప ర్యాగింగ్ చేయకూడదన్నారు. విద్యార్థులు కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నశనం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ కృష్ణంరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దిశా వ్యవస్థ, ర్యాగింగ్ వంటి అంశాలపై కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, 81 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 31న ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెండో పట్టణ సిఐ డి.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కృష్ణచైతన్య, దిశా ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

1 నుంచి 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నవంబర్ ఒకటో తేదీ నుంచి భవిష్యత్ గ్యారెంటీ నిర్వహించనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. భవిష్యత్తు గ్యారెంటీ భీమవరం నియోజకవర్గ అవగాహన సదస్సును టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల లబ్ధిదారుల ఎంపికను నియోజకవర్గంలోని బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, జనసేన నాయకులతో కలిసి నవంబర్ 1 తేదీ నుంచి నిర్వహించు భవిష్యత్తు గ్యారెంటీతోనే టిడిపి, జనసేనలకు అధికారం రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే బూత్ ఇన్‌ఛార్జులు తగిన శిక్షణతో అవగాహన కలిగి రోజుకు 10 కుటుంబాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని 233 బూత్ ఇన్‌ఛార్జుల్లో సరిగ్గా పనిచేయని వారి స్థానంలో కొత్తవారిని నియమించి నవంబర్ 1 నుండి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు మేరగాని నారాయణమ్మ, ఎండి నౌషాద్ పామర్తి వెంకటరామయ్య పాల్గొన్నారు.


ఎల్ఎన్.పురంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వ నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఎల్ఎన్.పురం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వైసిపి ప్రభుత్వానికి పరిపాలన చేతగాక ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచి వీరవల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి గుడాల శివన్నారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు మంతెన కోదండ రామరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థి దశ నుండే లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా అడిషనల్ ఎస్‌పి అల్లూరి సుబ్బరాజు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక డిఎస్‌పి కార్యాలయం వద్ద పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, ఆయుధాల పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిపిఒ, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.


ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

వంద పడకల ఆసుపత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వారు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని వైద్యులు బయట ప్రాంతాల్లో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరవ్వడం వల్ల రోగులకు వైద్య సేవలందకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల్లో జాప్యం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.12.85 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వాసుపత్రి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా పూర్తి కాకపోవడం దురదృష్టకరం అన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు సహకారంతో నాబార్డ్ నిధులు రూ.12.85 కోట్లు మంజూరయ్యాయని, ప్రభుత్వం మారడంతో నిధులను మళ్లించడం, చేసిన పనికి నిధులు విడుదల కాకపోవడంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయని చెప్పారు. పనులు త్వరితగతిన జరిగేలా ప్రభుత్వంతోపాటు అధికారులు, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పూర్తి చేయాలని కోరారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నారాయణరావు

ప్రతి ధాన్యపు గింజా కొనాలి

మండల వ్యవసాయ అధికారి నారాయణరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారి వి.నారాయణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై విలేజ్ అగ్రికల్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, కోపరేటివ్ బ్యాంక్ అధికారులు, సివిల్ సప్లై, రెవెన్యూ, ధాన్యం కొనుగోలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుకు అండగా నిలబడాలనే ముఖ్యోద్దేశంతో ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు చేర్చే వాహనాలకు జిపిఎస్‌ను అమర్చి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ నూకల మురళీ గంగాధర్‌రావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ శివకృష్ణ, ఆర్ఐ నాగభూషణం నాయుడు పాల్గొన్నారు.

తాగు, సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణం చర్యలు చేపట్టాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు జల వనరుల శాఖ అధికారులకు సూచించారు. భీమవరంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఆయన జల వనరుల అధికారులతో తాగు, సాగునీటి సరఫరాలోని ఇబ్బందులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ వెంకయ్య వాయ్యేరు కాలువ తూడుతో పూడుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అజ్జమూరు, కలవపూడి గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయన్నారు. దొడ్డనపూడి, మోగల్లు, కాళ్ల, బొండాడ తదితర గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయన్నారు. పరిస్థితి మరింత దారుణంగా మారకముందే అధికారులు వెంటనే చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రబీలో సాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలో పేరుకున్న తూడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఇఇ దక్షిణామూర్తి, డిఇ లు మూర్తి, శ్రీనివాస్, ఎఇలు ప్రసాద్‌రాజు, రాము, ఫణిశంకర్, నాయకులు పొత్తూరి వెకటేశ్వరరాజు, ముదుండి సుబ్రహ్మణ్యంరాజు, సంకురుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

బాధితులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - ఉండి

పాములపర్రు, పెదకాపవరం వరకూ రహదారి విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోయే బాధితుల్లో అర్హులైన వారందరినీ పారదర్శకంగా క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామని ఆర్‌డిఒ దాసి రాజు ఇచ్చిన హామీ ప్రకారం వారికి న్యాయం చేస్తామని అధికారులు గురువారం ఎంఎల్ఎ మంతెన రామరాజుకు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ఎంఎల్ఎతో మాట్లాడుతూ అర్హులందరికీ న్యాయం చేస్తామని, అనర్హులు తమ విధులకు ఆటంకం కలిగిస్తే పోలీసు బలగాలతో తమ పని చేసుకుంటామని చెప్పారు. ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ప్రత్యామ్నాయం కల్పించిన తర్వాతే తమ పని చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కేసన శాంతికుమారి, బలుసులరావు, ఎంపిటిసి యడవిల్లి వెంకటేశ్వరరావు, తోట రాము పాల్గొన్నారు.

44వ రోజుకు టిడిపి రిలే దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న టిడిపి నేతలు

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా 44వ రోజు పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. గురువారం యలమంచిలి మండలంలోని పలువురు నేతలు దీక్షల్లో కూర్చున్నారు. వీరికి సంఘీభావంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ జెడ్‌పిటిసి బోనం నాని, టిడిపి మండల అధ్యక్షుడు మామిడి శెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 19, 3వ వార్డుల్లో మహాశక్తి కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి ఇంటింటికీ తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టో గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు ఎస్తేరు రాణి, ప్రధాన కార్యదర్శి పెండ్యాల భవాని వెంకటరమణ, సంగుల విజయలక్ష్మి పాల్గొన్నారు.

వెండి రథంపై వాసవీ మాత ఊరేగింపు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో కొలువైన వాసవి మాత గురువారం 450 కేజీల వెండితో నిర్మించిన రథంపై పట్టణ పురవీధులలో విహరించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పట్టణ పురవీధులలో విహరించే ఏకైక అతిపెద్ద వెండి రథం కావడం విశేషం. తాడేపల్లిగూడెం శ్రీ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు జరిపించి తదనంతరం రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 8 రాష్ట్రాలకు చెందిన వివిధ కళాకారుల బృందం ప్రదర్శనలిచ్చారు. 300 మంది కళాకారులు, 150 మంది వాసవి సైన్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవ కమిటీ ఛైర్మన్ కొనకళ్ల హరినాథ్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా రథోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు.

'మేనిఫెస్టోలో వీటిని పొందుపర్చండి'

పాలకొల్లు : నివాసయోగ్యమైన గూడు, కుటుంబ కనీస అవసరాలు తీర్చగల ఉపాధి, విద్య, వైద్య సదుపాయం, తాగునీటి సౌకర్యం కల్పించాలని కాపు సేన కోరుకుంటున్నట్లు కాపు సేన వ్యవస్థాపకులు చేగొండి హరరామ జోగయ్య చెప్పారు. ఈ మేరకు నవంబర్‌లో విడుదల చేసే జనసేన - టిడిపి మేనిఫెస్టోలో వీటిని పొందుపర్చాలని పవన్ కళ్యాణ్‌ను కోరినట్లు ఆయన నివాసంలో మీడియా సమావేశంలో తెలిపారు. సంక్షేమ పథకాలు తెల్లరేషన్ కార్డుదారులందరికీ వర్తింపజేయాలన్నారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలన్నారు.

వ్యక్తి అరెస్టు

తాడేపల్లిగూడెం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి విజయవాడ కోర్టులో హాజరుపర్చినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పిఎస్ఐజి.శ్రీహరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజమండ్రి రైల్వే డిఎస్‌పి బివిఎస్.నాగేశ్వరరావు ఉత్తర్వుల మేరకు భీమవరం రైల్వే లైన్ సిఐ ఎస్.శంకరరావు ఆదేశాలమేరకు, తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ శ్రీహరి బాబు, రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న కర్లపూడి గ్రామం, నందిగాం మండలం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జినగా జయకృష్ణ, తండ్రి గంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 88 గ్రాముల బంగారు ఆభరణాలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజలకు ఆరోగ్య సురక్ష వరం

ప్రజాశక్తి - ఆచంట

పేదల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నరసింహప్రసాద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం అయోధ్యలంకలో గ్రామ సర్పంచి కడలి కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతోపాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, కార్పొరేట్ స్థాయిలో స్పెషల్ డాక్టర్లను తీసుకు రావడం జరిగిందన్నారు. శిబిరంలో సుమారు 655 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యాధికారులు రామాంజనేయులు, కిషోర్, హైందవి సత్యవతి, వేణు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : ఆరోగ్య సురక్షను ప్రారంభిస్తున్న సర్పంచి

ఉండి : ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి సంజీవని వంటిదని యండగండి సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. గురువారం యండగండి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న చిన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజారోగ్యానికి సంజీవని వంటిదని సూచించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు వెంకట రామకృష్ణ, వేగేశ్న వేణు, వర్ధనపు ప్రసంగి, బొడ్డు సూరమ్మ, వెలగపల్లి టోనీ బాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, వన్‌టౌన్‌కి చెందిన యర్రంశెట్టి విజయ అనంతలక్ష్మి సత్యవతి దేవి అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **X9997630 అను నా పాస్‌పోర్టు ది.23-10-2023వ తేదీన మేము ఇల్లు మారుతుండగా పోయినది.** కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకి తెలియజేయగలరు.

యర్రంశెట్టి విజయ అనంతలక్ష్మి, సత్యవతి దేవి
వన్‌టౌన్, ఏలూరు, ఏలూరు జిల్లా.
సెల్: 98481 45579